# పిడుగు

ఆ వీధి వీధంతా రొచ్చే. ఇళ్ళల్లో మురుగునీళ్ళన్నీ రోడ్డుమీదే వుంటాయి. ఆవీధిలో డాబా ఇళ్ళ కంటే పెంకుటిళ్ళే ఎక్కువ. పదేళ్ళ కిందట వేసిన కంకర రోడ్డు మీద మోకాలు లోతు మట్టి.

ఆ వీధికే లీడర్‌లా తలెగరేస్తూ పెద్ద రంగుల డాబా. డాబా మీద పెద్దగది. అందులో పందిరి మంచం. వెనకా ముందూ నిలువెత్తు అద్దాలు.

ఆ ఇంటి ముందు బర్రెలు. వాటికి తాటాకు పందిళ్ళు. నీళ్ళు త్రాగేటందుకు రాతి తొట్టెలు. ఓ పక్కగా గడ్డి. తవుడు బస్తాలు. పేడ కంపు.

ఆ ఇంటి యజమానురాలు మాణిక్యం. మనిషి పిటపిటలాడుతుంటుంది. చామనఛాయే అయినా కళకళలాడు తుంటుంది. ఏడు గంటలయ్యేటప్పటికల్లా షూటింగ్‌కు రెడీ అయిన సినిమా స్టార్‌లా తయారవుతుంది. ఓ అరగంటసేపు వరండాలో కూర్చొని పనివాళ్ళు పాలమ్ముతుంటే అజమాయిషీ చేస్తుంటుంది.

ఆ పని అవ్వగానే మేడెక్కి పందిరి మంచం మీద కూర్చుంటుంది. ఆవిడంటే పడి చచ్చేవాళ్ళు ఆ ఊళ్ళో చాలా మంది వున్నారు. ఆవిడ పేరు తెలిసిన వాళ్ళు ఆడామగా కొన్ని వందలమంది వున్నారు.

తట్టుకోగలిగినవాడు మేడెక్కుతాడు. లేని వాళ్ళు పెందరాళే వచ్చి ఆమెను చూస్తూ పాలుపోయించుకొని తృప్తి పడుతుంటారు.

ఆమె ఇంటికి తరచు వచ్చే మనిషి వెంకటాచలం. బాగా డబ్బుండి కొవ్వెక్కిన మనిషి. నెలకు అయిదారు సార్లు ఆవిడతో ఆ మేడమీద ఓ గంటసేపు కాలక్షేపం చేస్తుంటాడు.

ఆరోజు ఎనిమిదిన్నరకు సిల్కులాల్చీ జేబులో పాలిస్టర్ ధోవతంచు దోపుకొని మేడమెట్లు దిగాడు వెంకటాచలం.

క్రిందకు దిగి గొడ్ల కంపుకు ముఖం చిట్లించుకుంటూ అక్కడే తచ్చట్లాడుతున్న చిన్నాను చూచాడు. వాడికి పదేళ్ళుంటాయి. సన్నగా వున్నాడు. పొట్టి నిక్కరు వేసుకొని చొక్కా తొడుక్కున్నాడు. వాడు మాణిక్యం ఒక్కగా నొక్క కొడుకు.

"ఇందాక కనబడలేదేంరా చిన్నా... ఇంద... ఈ పదీ తీసుకెళ్ళి ఏమన్నా కొనుక్కో!" అంటూ వాడికి పది రూపాయల నోటిచ్చాడు.

వాడు మొహమాటంగా నవ్వుతూ ఆ నోటు తీసుకున్నాడు.

వాడిని చూస్తూ, "ఇంతకీ నీకు మీ నాన్నెవరో తెలిసిందిరా?" అన్నాడు ఎగతాళిగా. వాడిని ఆటపట్టించటం వెంకటాచలంకు సరదా. వాడిని చూస్తూనే కళ్ళు చికిలించి పళ్ళన్నీ బయటకు పెట్టి నవ్వుతుంటాడు.

చిన్నా ఇబ్బందిగా ఆయన వంక చూసి తల తిప్పుకొని బయటకు వెళ్ళిపోయాడు.

వెంకటాచలం వాడి సమాధానం కోసం ఎదురు చూడలేదు. బయటకు వచ్చి వాకిట్లో పెట్టిన స్కూటర్‌ను స్టార్ట్ చేసి సెంటర్‌కు వెళ్ళిపోయాడు. అక్కడ క్లబ్బులో ఓ గంటసేపు పేకాడతాడు. తొమ్మిదీ పదీ మధ్య భార్యకు ఓ నాలుగు మూరల మల్లెపూల దండ తీసుకొని ఆమె మీద ప్రేమను కురిపిస్తూ ఇంట్లో కాలు పెడతాడు.

చిన్నా స్కూటర్ దూరంగా వెళ్ళిపోయేటంత వరకూ దీపపు స్తంభం నీడలో నిలబడి చూస్తూ వుండిపోయాడు.

ఆయనగారు డబ్బులిస్తారు– బాగానే వున్నది– ఇస్తున్నప్పుడల్లా ఆ ప్రశ్న వేస్తాడేమిటి? మహా చికాగ్గా వుంటుంది ఆ ప్రశ్న వినాలంటే ఆ పిల్లవాడికి.

తెలియదా ఆయనకు– ఈ వీధిలో తనకే కాదు చాలామంది పిల్లలకు తండ్రులెవరో తెలియదని!

తను గమనిస్తూనే వున్నాడు– ఆయన ఆ ప్రశ్న వేయడం... నవ్వడం... తన సమాధానం కోసం ఆగకుండానే స్కూటరెక్కి వెళ్ళిపోవడం...

ఇప్పటికి అతడు ఆ ప్రశ్న వేయటం ఏ పదోసారో!

సాయంత్రమే తల్లి దగ్గర బాగా చివాట్లు తిన్నాడు- ఎవరికో పాలు పోస్తూ క్రింద ఒలకబోసినందుకు. అప్పటి నుండీ మహా చికాగ్గా వున్నాడు. తను కావాలని పారబోశాడా? అయినా ఎన్ని పోయాయని...

దానికితోడు ఈ వెంకటాచలం వెధవ ప్రశ్న వాడిని మరింత కలచివేసింది. కోపం తెప్పించింది.

కసిగా చేతిలోని అతడిచ్చిన పది రూపాయల నోటును ఉండలా చుట్టి జేబులో కుక్కుకున్నాడు.

ఇంటి మెట్లు దిగాడు. అలవాటు పడ్డ దారవ్వడంతో కాలికి బురదవ్వకుండా నడుస్తున్నాడు ఆ సందులో. ఆ వీధి చివర్లో వున్న దబ్బా కొట్టు ముందు ఆగి చాక్లెట్లు తీసుకున్నాడు ఆ పదిరూపాయల నోటిచ్చి.

"వెంకటాచలంగారు ఇచ్చారేమిట్రా!" అన్నాడు ఆ కొట్టులో ముసలాడు నవ్వి చిన్నాకు మిగతా చిల్లరిస్తూ...

చిన్నా మాట్లాడలేదు. తీసుకున్న చాక్లెట్ల రేపర్లన్నీ తీసి ఒకేసారి నోట్లో వేసుకుని కసిగా నములుతూ రోడ్డెక్కాడు పడివడిగా అడుగులేస్తూ.

'వెధవలకి అందరికీ ఎగతాళిగానే వున్నది తనంటే!' అనుకున్నాడు పళ్ళు కొరుక్కుంటూ.

ఒళ్ళంతా సెగలు పొగలతో రగిలిపోతోంది కోపంతో.

అతడు నడుస్తూనే వున్నాడు. నాలుగు వీధులు దాటటానికి పావుగంట పట్టింది. పెద్ద రోడ్డెక్కాడు. తెల్ల బల్బుల కాంతిని దాటి మళ్ళీ చిన్న రోడ్డులోకి తిరిగాడు.

అక్కడ మొదట్లోనే రెండంతస్తుల మేడ ముందు ఆగాడు. పైకీ క్రిందకూ చూశాడు ఒక్కసారి.

కళ్ళల్లో ఎర్ర చారలు ఏర్పడుతున్నాయి.

చిన్నగా ఆ ఇంటి అరుగుల మధ్యగా వున్న నాలుగు మెట్లూ ఎక్కి గేటును లోపలకు నెట్టాడు. వరండాలో కూర్చొని ఎవరితోనో కబుర్లు చెబుతున్న ఆమెను చూశాడు.

"మా నాన్న ఉన్నారా అండీ?" అన్నాడు.

ఆమె వింతగా అతడి వంక చూసింది. "ఎవరు నువ్వు... ఎవరిల్లు కావాలి... మీ నాన్న అంటే పేరు లేదా?"

"ఇది వెంకటాచలం గారి ఇల్లే కదండీ!" అన్నాడు వినయంగా చిన్నా.

"అవును!"

"ఆయనే కదండీ మా నాన్న!... నేను మాణిక్యం కొడుకునండీ... రోజూ మా ఇంటికి వచ్చి మా నాన్న నాకు చాక్లెట్లు కొనిపెడుతుంటాడండీ... ఇవాళ ఎందుకో రాలేదు... మా అమ్మ వెళ్ళి వెంటనే రమ్మనమని చెప్పమన్నది!" అంటూనే... ఆమె ఏమంటున్నదో కూడా వినిపించుకోకుండా- తన కసినంతా ఆ గేటు లోపలే కుమ్మరించేసి- రోడ్డు మీదకు పరుగెత్తాడు చిన్నా!

* * *

*(పత్రిక: మాసపత్రిక: అక్టోబరు, 2002)*